# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 17 మే, 2026 | పేజీలు :08


## మంత్రి శ్రీధర్ బాబుకు బోయిన్‌పల్లి సమస్యలపై వినతిపత్రం



**ప్రజాపక్షం/ముత్తారం:** బోయిన్‌పల్లి పరిధిలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోయిన్‌పల్లి 6వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు.శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆమె మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బోయిన్‌పల్లి ప్రాంతంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.కౌన్సిలర్ శ్రీలత క్రాంతి విన్నవించిన సమస్యలపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.తమ వార్డు సమస్యలపై తక్షణమే స్పందించి, హామీ ఇచ్చినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు కౌన్సిలర్ శ్రీలత క్రాంతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

### మంత్రి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ఎండపల్లి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్ ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు.అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మండలంలో పార్టీ బలోపేతానికి పనిచేయాలని మంత్రి సూచించారు. గతంలో పనిచేసిన నాయకులతో పాటు కార్యకర్తలను విస్మరించకుండా పార్టీ నియమాలను లోబడి పనిచేస్తు వచ్చే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండపెల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### 48 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి

## ప్రభుత్వ ఆధీనంలోకి: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నెం. 273లో ప్రభుత్వ భూములపై జరిగిన అక్రమ ఆక్రమణలు, చట్టవిరుద్ధ రికార్డు నమోదులపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సర్వే నెం. 273లో మొత్తం 130.00 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో దాదాపు 59.00 ఎకరాలు కాస్తులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అందులో సుమారు 48.00 ఎకరాల భూమిని 23 మంది రైతులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని మొఖాపై సాగు చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో Land Encroachment Act, 1905 ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం, రికార్డులను సమగ్రంగా పరిశీలించి వారు పొందిన పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారించినట్లు తెలిపారు. తదనంతరం తహశీల్దార్, ధర్మారం ఆధ్వర్యంలో సుమారు 48.00 ఎకరాల ప్రభుత్వ భూమిని గట్లు చదును చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా, చట్టవిరుద్ధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని ఉన్నా, స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు.

# అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఇటీవల అంతరాష్ట్ర సాయుధ ముఠాలు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యంత కట్టుదిట్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇటీవల పీఎంజే జ్యువెలర్స్ లో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, కమిషనరేట్ పరిధిలోని అన్ని వ్యాపార, ఆర్థిక సంస్థల యాజమాన్యాలు, సెక్యూరిటీ ఏజెన్సీలు పలు రక్షణ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సంస్థల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, లాకర్ రూములు కవర్ అయ్యేలా హై–రిజల్యూషన్ నైట్ విజన్ సీసీటీవీ కెమెరాలను నిరంతర విద్యుత్ బ్యాకప్‌తో ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. సమీప పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించబడిన బర్గర్ అలారాలు, పానిక్ బటన్లను అమర్చడంతో పాటు, గుర్తింపు పొందిన శిక్షణ కలిగిన సెక్యూరిటీ గార్డులను (వీలైనంత వరకు సాయుధ సిబ్బందిని) నియమించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, లోపలి ప్రాంగణంలోకి అనవసరమైన వ్యక్తుల రాకపోకలను నియంత్రించాలని, నగదు లేదా బంగారం రవాణా సమయాల్లో తీవ్ర గోప్యత పాటించాలని, సంస్థల్లో పనిచేసే రెగ్యులర్, తాత్కాలిక సిబ్బందికి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించి అనవసరంగా లోపలికి వచ్చే వారి పట్ల, పరిసరాల్లో రెక్కీ నిర్వహిస్తున్నట్లు అనుమానం వచ్చే వారి పట్ల యాజమాన్యాలు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సాయుధ నేరగాళ్లను నేరుగా ఎదుర్కొని ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా, కస్టమర్ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మరోవైపు, అంతరాష్ట్ర ముఠాల కదలికలను అణచివేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన నిఘా చర్యలు చేపట్టినట్లు సీపీ వివరించారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా, గుర్తుతెలియని వ్యక్తులు నిఘా వేసినట్లు గమనించినా, లేదా అనుమానాస్పద వాహనాలు నిలిపి ఉంచినా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100/112కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల ఆస్తుల రక్షణకు కరీంనగర్ పోలీస్ యంత్రాంగం పూర్తి అంకితభావంతో పనిచేస్తుందని సీపీ స్పష్టం చేశారు.





# పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ కార్యకర్తల నిరసన

**ప్రజాపక్షం/శంకరపట్నం:** పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి పిటల సమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పెట్రోల్,డిజిల్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతుందని తీవ్రంగా విమర్శించారు.సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహం నుండి బస్‌స్టాండ్ వరకు ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్నంగా నిరసన తెలిపారు.ప్రజల రక్తాన్ని పిండి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా నరేంద్ర మోడి ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడ్డారు.రైతులు కూలీలు,కార్మికులు,వ్యాపారులతో సహ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతుందని విమర్శించారు. ఇందన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బి ఓ సి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేగుల కుమార్,సిపిఐ మండల సహయ కార్యదర్శులు కన్నం సదానందం,గోదారి లక్ష్మణ్, బోజ్జ సదానందం,ఎండి బాదుల్లా అడితం రమేష్, పూదరి ఓదయ్యా, సంపత్, కాసిం, నూనె సారయ్యా, మహేందర్ రెడ్డి, కుమార్, పాల సంపత్, శివప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి'

**ప్రజాపక్షం/కరీంనగర్:** బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కోతి రాంపూర్ లోని ముకుందలాల్ మిశ్రా భవన్ లో సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శిలు గుడికందుల సత్యం, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు జిందం ప్రసాద్ లు మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలతో బండి సాయి భగీరథ్ పై ఫోక్సో కేసు నమోదై ఎనిమిది రోజులు గడిచిన ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తన అధికార పలుకుబడిని ఉపయోగించి కేసును తప్పుదోవ పట్టిస్తున్నాడని ఈ సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫోక్సో కేసులో నిందితుడిని తక్షణమే కోర్టుకు హాజరు పరిచి విచారణ జరిపించి జైలుకు పంపించాల్సి ఉండగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సిట్ పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయం గా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాయకంటి శ్రీనివాస్, సుంకరి సంపత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్, పాల్గొన్నారు.

## కొనసాగుతున్న తొలి దశ జనగణన తనిఖీ

**ప్రజాపక్షం/కరీంనగర్:** జన గణన ప్రక్రియలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలో కొనసాగుతున్న తొలి దశ జన గణన ప్రక్రియలో భాగంగా శనివారం పలు డివిజన్ల పరిధిలో పర్యటించారు. నగరంలోని రాంనగర్, శ్రీహరినగర్ తదితర ప్రాంతాల్లో పలు హౌజ్ లిస్ట్ బ్లాక్ లను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. సంబంధిత బ్లాక్ ల బౌండరీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జన గణన తొలి దశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్ బ్లాక్ నెంబరింగ్, మ్యాపింగ్ ప్రక్రియ పై ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేస్తూ... ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. జనాభా లెక్కింపులో పొరపాట్లు జరగకుండా చర్యలు తీస్కోని ప్రతి నివాస గృహాన్ని సర్వే చేసి ఖచ్చితమైన వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన 2027 జనాభా లెక్కింపులో ప్రజలు భాగస్వాములు కావాలని వివరాల నమోదు కొసం వచ్చిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు సహకరించి... సరైన వివరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో కరీంనగర్ ఏఎస్ఐ 'పల్లి ఉమారాణి'కి కాంస్య పతకం

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఘనంగా నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో (ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్) కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉమెన్ ఏఎస్సై పల్లి ఉమారాణి అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈ నెల 9 తేది నుండి 13 వ తేది వరకు లక్నోలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీలలో, ఉమారాణి ఉమెన్ డబుల్స్ 50 ఏళ్ళ వయసు విభాగంలో తెలంగాణ పోలీస్ శాఖ తరపున ప్రాతినిధ్యం వహించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్ర పోలీస్ శాఖకు ఆమె మంచి పేరు తీసుకువచ్చారు. పోటీలు ముగించుకొని నగరానికి చేరుకున్న ఏఎస్సై పల్లి ఉమారాణి శనివారంనాడు కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమారాణి ప్రతిభను సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. 50 ఏళ్ల వయసులోనూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లో ఈ స్థాయి ప్రతిభ కనబరచడం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొని ఉమారాణికి అభినందనలు తెలిపారు.



## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థులు చదువుతోపాటు విభిన్న రంగాల్లో రాణించాలని, భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో సాంస్కృతిక వారసత్వానికి కళలకు నిలయమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని తెలిపారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆర్ట్ క్రాఫ్ట్ మేళా వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రాయింగ్ కాంపిటీషన్, కళా ఉత్సవ్ వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్లు డి.శ్రీనివాస్, శ్రీధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.




## కరీంనగర్‌లో కొనసాగుతున్న తొలి దశ జనగణన

**ప్రజాపక్షం/కరీంనగర్:** జన గణన ప్రక్రియలో ఎలాంటి లోటు పాట్లు జరగకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలో కొనసాగుతున్న తొలి దశ జన గణన ప్రక్రియలో భాగంగా శనివారం పలు డివిజన్ల పరిధిలో పర్యటించారు. నగరంలోని రాంనగర్, శ్రీహరినగర్ తదితర ప్రాంతాల్లో పలు హౌజ్ లిస్ట్ బ్లాక్ లను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. సంబంధిత బ్లాక్ ల బౌండరీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జన గణన తొలి దశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్ బ్లాక్ నెంబరింగ్, మ్యాపింగ్ ప్రక్రియ పై ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేస్తూ... ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ జన గణన లో చేపట్టిన హౌజ్ లిస్ట్ బ్లాక్స్ మ్యాపింగ్, సిఎన్ హౌజ్ నెంబరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జనాభా లెక్కింపులో పొరపాట్లు జరగకుండా చర్యలు తీస్కోని ప్రతి నివాస గృహాన్ని సర్వే చేసి ఖచ్చితమైన వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించాలని ఆదేశించారు. జన గణన ప్రక్రియ విధుల్లో అలసత్వం ప్రదర్శించ కుండా ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 2027 జనాభా లెక్కింపులో ప్రజలు భాగస్వాములు కావాలని వివరాల నమోదు కొసం వచ్చిన ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు సహకరించి... సరైన వివరాలను అందించాలని కోరారు. నగర అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు జన గణన సర్వే చాలా ప్రధానం అన్నారు. ఎన్యూమరేటర్లు సూపర్ వైజర్లు హౌజ్ లిస్ట్ బ్లాక్స్ వారిగా ప్రతి ఇంటిని సందర్శించి నెంబరింగ్ చేయడంతో పాటు మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రజలు జన గణన ప్రక్రియ వేగవంతం ముగిసేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జన గణన ప్రక్రియ నగర అభివృద్ధి ఎంతో ముఖ్యమని... ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

**ప్రజాపక్షం/శంకరపట్నం:** పోయిన సెల్ ఫోన్ వెతికి పట్టుకున్న పోలీసులు శనివారం బాదితునికి అప్పగించారు.కేశవపట్నం ఎస్ఐ శేకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి కొండపలకల గ్రామానికి చెందిన భాషవేణి సంతోష్ అనే యువకుడు సెల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను గుర్తించి స్వాదీనం చేసుకొని బాధితునికి సెల్‌ఫోన్ అందజేశారు.బాధితుడు సంతోష్ ఎస్ఐ శేకర్‌రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

## తారు రోడ్డు నిర్మాణం నాణ్యతతో చేయాలి

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మున్సిపల్ పరిధిలో సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా ఇరువైపులా తారు డబుల్ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యతతో చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, చైర్‌పర్సన్ వడ్లూరి సరితలకు కౌన్సిలర్ కొత్త సుమలత గంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ నలుమాచు జ్యోతి రామకృష్ణ, కొత్తూరి మహేష్, మూడూరి శ్రీనివాస్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనిలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు పాత తారు రోడ్డు తొలగించకుండా కొత్తగా దాని పైన తారు రోడ్డు వేయుటకు నిబంధనలకు విరుద్దంగా ఉన్నదని తెలిపారు. సంబంధిత ఇంజనీర్లు అంచనాల ప్రకారం షిల్ట్ తొలగించి రోడ్డు వేయాలని, పనులకు సంబంధించిన అంచనా లెక్కల ప్రకారం పనులు జరుగుట లేదని అన్నారు. ఎస్టిమేట్ ప్రకారం అధికారులు పరిశీలించి పనులు జరిపించాలని కోరారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యత తో చేయకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో పన్నెండు లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన నరేందర్ రెడ్డి మాట్లాడారు. గత రెండున్నర సంవత్సరాలుగా అనేక మందిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని అందరికీ అందుబాటులో ఉంటూ వివిధ సమస్యలతో వచ్చేవారి కోసం పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించిన హెల్ప్ డెస్క్ ఎంతో మంది నిరుపేదలకు సహాయం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నామని , ప్రజల దీవన ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. చెక్కుల పొందిన వారిలో తంగెల్లపల్లి లచ్చయ్య ,గొడుగు పద్మ, బూస రమేష్, సర్దార్ అమర్‌దీప్ గౌర్, సాయిల్ల కొమురవ్వ, చెల్లోజు శివమణి, ఉప్పరిపల్లి కనుకవ్వ, తదితరులున్నారు.

## కరీంనగర్ మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో వసూళ్ల మాఫియా

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** కరీంనగర్ మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో కొందరు అధికారులు, మధ్యవర్తులు కలిసి నడుపుతున్న వసూళ్ల దందా రోజురోజుకూ మాఫియా స్థాయికి చేరుకోవడం అత్యంత దారుణమని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల చెమటను దోచుకుంటూ, ఉద్యోగాల పేరుతో హాజరు పేరుతో షిఫ్ట్‌ల పేరుతో, కాంట్రాక్టుల పేరుతో పదోన్నతి పేరుతో వేల రూపాయల అక్రమంగా వసూలు చేస్తున్నారని వస్తున్న ఆరోపణలు ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే ఘటన అని పేర్కొన్నారు. కార్మికులను మానసికంగా , ఆర్థికంగా వేదిస్తూ డబ్బులు ఇవ్వకపోతే పని ఉండదు అనే బెదిరింపులతో దోపిడీ చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ కార్మికుల గౌరవాన్ని తుంగలో తొక్కే ఈ అవినీతి గ్యాంగ్‌పై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేకపోతే ప్రజల మధ్యకు వెళ్లి ఈ అవినీతి బండారాన్ని బయటపెట్టి బారీ ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ హెచ్చరించారు.

# రహదారిపై ధాన్యపు కుప్పలు, వాహనదారులకు నరకప్రాయం

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి ప్రధాన రహదారిపై రైతులు వరి ధాన్యం ఆరబోయడంతో వాహనదారుల ప్రయాణం నరకప్రాయంగా మారింది.మంథని నుండి తాడిచర్ల వెళ్లే రహదారి మధ్య ఇది అత్యంత కీలకమైన ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ నిరంతరం వాహనాల రద్దీ ఉంటుంది. అయితే, డబుల్ రోడ్డులో ఒక వైపు పూర్తిగా ధాన్యపు కుప్పలు విస్తరించి ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకోవడానికి కనీస స్థలం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ ధాన్యపు కుప్పలు సరిగ్గా కనిపించకపోవడంతో పెద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారిపై ధాన్యపు కుప్పల వల్ల ప్రమాదం జరిగి ఏదైనా ప్రాణ నష్టం సంభవిస్తే దానికి బాధ్యులు ఎవరు? అని వాహనదారులు, ప్రయాణికులు అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని,ప్రయాణం సురక్షితంగా సాగేలా చూడాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



## మున్సిపల్ కమిషనర్‌గా లోకేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/వేములవాడటౌన్: వేములవాడ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నియమితులైన లోకేష్ శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు పారదర్శకంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి మున్సిపల్ పరిధిలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు.పట్టణంలోని 10వ వార్డులో నెలకొన్న తాగునీరు కొరతను పరిష్కరిస్తూ వార్డు కౌన్సిలర్ సంగి ఆనంద్ తో కలిసి నూతన తాగునీటి పైపులైన్ ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.10వ వార్డులో కొంతకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు చెక్ పెడుతూ నూతన పైపులైన్ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.రామయ్య,అధికారులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## జూన్ 10 లోగా చేయూత పెన్షనర్లు లైవ్ ఫేస్ అథెంటికేషన్ పూర్తి

ప్రజాపక్షం /పెగడపల్లి : మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో గల చేయూత పింఛను దారులు అందరూ తప్పనిసరిగా తమ లైవ్ ఫేస్ అథెంటికేషన్, ఫోటో క్యాప్చర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. శశి కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రక్రియ శనివారం (మే 16) నుండి ప్రారంభమై, వచ్చే నెల జూన్ 10, 2026 వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పెన్షన్ దారులు అందరూ తమ పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగిసేలోగా లబ్ధిదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ ప్రకటన ద్వారా లబ్ధిదారులను కోరారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన ఉద్యమకారులు



ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిన సందర్భంగా పెద్దపల్లి బస్టాండ్ డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం రోజున తెలంగాణ ఉద్యమకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేసిన అనంతరం అమరవీరులకు నివాళి అర్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు,త్యాగాలను గుర్తిస్తూ ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి జీఓ విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో కష్టనష్టాలను భరించిన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ఆనందదాయకమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు , ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణ రావు , మక్కన్ సింగ్ , ఎంపీ వంశీ నాయకత్వంలో ఈ ప్రాంత నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.అలాగే ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేసి, ఉద్యమకారుల కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు దబ్బేటి చంద్రకళ, కందుల సదాశివ, ముల్ల మల్లేష్,అశోక్ పటేల్, ధనుంజయ, కేశవ రెడ్డి, ఉప్పల శ్రీనివాస్, మాదాల పోచాలు,మండ భాస్కర్ యాదవ్, ఎన్. రామస్వామి, జ్యోతి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ అభినందనీయం




ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : ప్రతీ నెల అమావాస్యను పురస్కరించుకొని గాయత్రి సేవా సమితి ద్వారా అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి జెండా చౌరస్తా వద్ద గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణరావు ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీనెల అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ చేయడం ద్వారా 35వ నెలను పూర్తి చేసుకోవడం గొప్ప విషయమన్నారు. దాతలుగా వ్యవహరించిన ఆవునూరి త్రివేణి రవి కుమార్ దంపతులు కీ.శే. ఆవునూరి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. గత 34 నెలలుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని వ్యవస్థాపక అధ్యక్షులు కాసనగొట్టు వినయ్ తెలిపారు. అనంతరం వేసవి దృష్ట్యా ప్రజలకు మజ్జిగ పంపిణీ కూడా చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్న, కౌన్సిలర్లు మంథని నర్సింగ్, దొడ్డుపల్లి జగదీష్, సేవా సమితి ప్రధాన కార్యదర్శి రావికంటి రాజు,ఉపాధ్యక్షులు చిట్టి మల్ల రవిప్రసాద్, కోశాధికారి కటకం సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ నాగమల్ల శ్రీనివాస్,బొల్లం ఆంజనేయులు,సభ్యులు ముస్త్యాల ప్రదీప్, తొడుపునూరి వెంకటేశం, సంకీస ఆంజనేయులు, కముటాల గురుచరణం,నార్ల రమేష్,అల్లెంకి మారుతీలు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమవుతున్న చెరువును సంరక్షించండి



ప్రజాపక్షం/సుల్తానాబాద్: మత్స్యకారుల మనుగడకు జీవం పోస్తున్న వారి బ్రతుకు భరోసానిస్తున్న సుల్తానాబాద్ ఊర చెరువును సంరక్షించాలని సుల్తానాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సుల్తానాబాద్ తహసిల్దార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణానికి తలమానికంగా ఉండి నేడు మినీ ట్యాంక్ బండ్ గా అవతరించనున్న సుల్తానాబాద్ ఊర చెరువు కబ్జాకారుల కోరల్లో చిక్కి అన్యాక్రాంతమవుతుందని అన్నారు. సుల్తానాబాద్ లోని సర్వే నెంబర్ 14 లో 217.13 విస్తీర్ణంలో ఉర చెరువు కలదు. దీనిపై దాదాపు 500 కుటుంబాలకు పైగా ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. నేడు కొందరు బడా బాబులు ప్రజాప్రతినిధులు చెరువు సీకం పై కన్నేసి అక్రమ భవనాలు నిర్మించడమే కాకుండా,అక్రమంగా మట్టిని తరలించడం ఇలాంటి పనులు చేస్తున్నారని తెలిపారు. గతంలో అధికారులకు వినతి పత్రం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇప్పుడైనా స్పందించి చెరువులను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గరిగే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అంజయ్య, రమేష్ లతోపాటు ఇతర మత్స్యకారులు, పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు ధరలను నియంత్రించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు ముగిసిన వెంటనే సామాన్య ప్రజలపై భారాన్ని మోపే విధంగా ధరలను పెంచిందని విమర్శించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనలో నరేంద్ర మోదీ ప్రజలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ తక్కువగా వాడాలని, ఒక సంవత్సరం పాటు బంగారం కొనవద్దని చెప్పడం బాధ్యతారాహిత్య వ్యాఖ్యలని ఆమె పేర్కొన్నారు. సామాన్య ప్రజల నడ్డి విరిచే విధంగా పాలన సాగిస్తోందని ఆరోపించారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.

## క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోమ్ గార్డ్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు.సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్‌లను అదనపు ఎస్పీ చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పోలీస్ అధికారులు,సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని సూచించారు. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం లేదా వాకింగ్ చేయాలని,బయట ఆహారం తగ్గించి రెగ్యులర్ హెల్త్ చెకప్ చేయించుకోవాలని తెలిపారు. ఈ పరేడ్‌లో డీఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ శ్రీనివాస్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రవణ్ యాదవ్, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడ్ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను వాహనాల ద్వారా మిల్లులకు, గోదాంలకు తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శనివారం ముస్తాబాద్ మండలం ఆవునూర్, గూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, బందనకల్ లోని రత్నవి రైస్ మిల్, నామాపూర్ లోని శ్రీ ధనలక్ష్మి రైస్ మిల్, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాంలకు తరలించిన ధాన్యం హమాలీల సంఖ్యను పెంచుకుని అన్ లోడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఫారూఖ్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

## దేశవ్యాప్త బంద్‌కు మద్దతుగా ఆర్డీఓకు వినతిపత్రం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మెట్‌పల్లి ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గాజెంగి సుదర్శన్ నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు గాజెంగి సుదర్శన్ మాట్లాడుతూ, 2026 మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త ఔషధ వాణిజ్య బంద్‌కు సంబంధించి ముందస్తు సమాచారం అందజేస్తూ, తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని సిఫారసు చేయాలని కోరినట్లు తెలిపారు.మెట్‌పల్లి కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ జిల్లా యూనిట్‌గా పనిచేస్తోందని, ఇది జాతీయ స్థాయి సంస్థ అయిన ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్‌లో భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారి విజయకృష్ణ, కోశాధికారి చిలివేరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోవర్ధన్, లక్ష్మణ్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# వోల్టేజ్ సమస్య పరిష్కారానికి,మూడు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మండలంలో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి మూడు కొత్త 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు అయినట్లు సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.శనివారం కాగజ్ నగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.మండలంలో అంకుసాపూర్, బోడేపల్లి,కాగజ్ నగర్ పట్టణంలోని కాపువాడలో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం కానున్నాయని తెలిపారు.అదేవిధంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని,దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే తమతమ ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లెపూల మధుకర్, ఎంపీడీవో సిహెచ్ ప్రజ్వల్ కుమార్, సర్పంచులు బికాస్ గారామి, వేణు యాదవ్, సంగీత,శ్రీనివాస్, రాజేందర్ జాదవ్, నాయకులు పుల్ల అశోక్, పిర్సింగుల తిరుపతి, లోనారే రవీందర్, సుధాకర్, దోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బలోపేతానికి నిరంతరం కృషి

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు రాపెల్లె గంగన్న నియామకం అయినందుకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూతన అధ్యక్షుడిని శనివారం రోజున వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, చందోలి గ్రామ సర్పంచ్ జక్కుల పావని దస్తగిరి,దట్నూర్ గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం,భీంరాజపల్లె సర్పంచ్ లత గంగచారి, లక్ష్మీ పూర్ గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్, తడగొండ విజయ్, ఎర్ర శ్రీనివాస్, చెవులమద్ది గంగాధర్, మద్దూరి నవీన్, రవి, సంజీవ్, రాజన్న,తదితరులు పాల్గొన్నారు.

# మైతాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**ప్రజాపక్షం/రాయికల్ :** మైదాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.వై . స్వాతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్లో ఉన్న వరి రకాల సాగు పై,తక్కువ యూరియా వాడకం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, నిర్దేశించిన పురుగు, తెగుళ్ల, కలుపు మందుల వాడకంలో,సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి, పచ్చిరొట్ట పంటల సాగు,నేల ఆరోగ్యం ,అలాగే వరి పంట కోసిన తర్వాత పంట అవశేషాలు కాల్చకుండా నేలలో కలియదున్నటం వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టీ.నాగమణి ,పంచాయతీ సెక్రెటరీ వేణు,ప్రజాప్రతినిధులు ,క్లస్టర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలిగేలా నిర్మాణాలు చేపట్టొద్దు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మొగిలిపేట గ్రామంలోని రహదారులను వార్డులలోని దారులను కాపాడుకోవడమే గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని గ్రామ సర్పంచ్ గోల్కొండ కళా రమేష్ అన్నారు.ఈ సందర్భంగా శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్వహించే నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరి అని, మెట్ల నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పనులు చేపట్టొద్దని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండవేణి రాజేందర్ పంచాయతీ కార్యదర్శి సౌజన్య, పాలకవర్గ సభ్యులు మేస్త్రీలు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శకత



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టం 2005 పై పీఐఒలకు, ఏపీఐఒలకు, అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, సమాచార కమిషనర్లు పి.వి.శ్రీనివాస్ రావు, దేశాల భూపాల్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని,ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపడంలో అలసత్వ వైఖరి తగదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజాసేవకులం అన్న విషయాన్ని మరువరాదని సూచించారు.పబ్లిక్ అథారిటీ బాధ్యతలు,విధులు, నిర్వర్తించే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు 4(1) బి రిజిస్టర్లను అప్డేట్ చేసుకోవాలని, వీటన్నిటిని ప్రజలకు తెలిసేవిధంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం లక్ష మందికి సమాచారం అందించడం జరిగిందని తెలిపారు.మరో 15000 వరకు అప్పీల్స్ రాష్ట్ర సమాచార కమిషన్ కు వస్తున్నాయని వివరించారు.ఇప్పటివరకు 20 జిల్లాలలో రాష్ట్ర సమాచార కమిషన్ పర్యటించిందని,సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న పాత కేసులు అన్నింటిని పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు లత,రాజ గౌడ్,తదితరులు ఉన్నారు.

# జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శుల నియామకాలుపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గాజంగి నందయ్య మాట్లాడుతూధర్మపురి మండల అధ్యక్ష,కార్యదర్శులుగా చిలుముల లక్ష్మణ్ కాసారపు బాల గౌడ్, బుగ్గారం మండల అధ్యక్ష కార్యదర్శులు గా నగునూరి నరసాగౌడ్, బత్తుల తిరుపతి,ఎండపల్లి అధ్యక్ష కార్యదర్శులు గా గెళ్ళు శేఖర్, రాజేశం,గొల్లపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులుగా రాపల్లి గంగన్న,జల్లి అనిల్ యాదవ్,పెగడపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు గా కదారి తిరుపతి,చాట్ల భాస్కర్ లను నియమించినట్లు తెలిపారు. అలాగే కోరుట్ల అధ్యక్షులుగా పన్నాల అంజయ్య, మల్లాపూర్ అధ్యక్షులుగా మాటొల్ల సమ్మయ్య, ఇబ్రహీంపట్నం అధ్యక్షులుగా గూడ శ్రీకాంత్,మెట్పల్లి అధ్యక్షులుగారాజేందర్,పట్టణ అధ్యక్షులుగా తిరుమల గంగాధర్,మెట్పల్లి పట్టణ అధ్యక్షులుగా మహమ్మద్ రయిసు దీన్ లను నియమించినట్లు పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ పర్యవేక్షణ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ధాన్యం తరలింపు, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓ లు, పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా, మార్కెటింగ్, మార్క్ ఫెడ్, కార్మిక శాఖ అధికారులు, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రెటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, హమాలీల సంఖ్యను డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారుల క్షేత్ర స్థాయి పర్యటనలతో సమస్యలు పరిష్కరించేందుకు ఆస్కారం ఉంటుందని, తమ పరిధిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

# జర్నలిస్ట్ సురేందర్ కుమార్‌ను పరామర్శించిన మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జెష్ కిరణ్ సురేందర్ కుమార్ ను శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. సురేందర్ కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్ లో చేరగా ఇటీవల వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స చేసారు.ఈ సందర్భంగా మంత్రి సురేందర్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు.సీనియర్ జర్నలిస్ట్ గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4 దశాబ్దాలుగా సేవలందిస్తున్న సురేందర్ కుమార్ త్వరగా కోలుకోవాలని మంత్రి అడ్లూరి ఆకాంక్షించారు.

# వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** వృద్ధ తల్లి దండ్రుల పోషణ విస్మరించి, వేధింపులకు గురిచేస్తే వారి కొడుకులకు, కోడళ్ళకు,కూతుర్లకు,వారసులకు జైలు శిక్ష విధిస్తామని,తల్లి దండ్రుల నుంచి కొడుకులు,కూతుర్లు పొందిన ఆస్తులను తిరిగి వారి తల్లి దండ్రుల పేరిట పట్టా మార్పిడి జరుగుతుందని జగిత్యాల డివిజన్ వయో వృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో పి. మధు సూదన్ హెచ్చరించారు.శనివారం వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీవో మధుసూదన్ రాయికల్ మండలం మూటపల్లి గ్రామానికి చెందిన ఏనుగు లింగారావు, సారంగపూర్ మండలం కొనాపూర్ గ్రామానికి చెందిన గడప బక్కవ్వ, జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతులాపురం రాజం అనే వృద్ధుల కేసుల్లో కొడుకులు, కూతుర్లు, కోడళ్ళను, అల్లుళ్లను,వారసులను విచారించారు.విచారణల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,కాన్సిలియేషన్ అధికారులు పి. సీ. హన్మంత్ రెడ్డి,వెల్ముల ప్రకాష్ రావు,వృద్ధుల చట్టం సీనియర్ సహాయకురాలు పద్మజ పాల్గొన్నారు.

# నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూమి రక్షించాలి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూములను రక్షించి, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని శనివారం బిజెపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 437, 251లో ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసుకొని ఆ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాధారణంగా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే నాలా కన్వర్షన్, ఇతర ప్రభుత్వ అనుమతులు అవసరమని,కానీ ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిని పట్టా భూములుగా చూపిస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు.నర్సింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 437లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అక్కడే కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మించాలని వారు అదనపు కలెక్టర్ కు వారు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ భూములు రక్షించబడటమే కాకుండా జిల్లాలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులోకి వస్తాయని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎసియస్ రాజు, సిపెల్లి రవీందర్, శ్రీనివాస్, కౌన్సిలర్ అరవ లక్ష్మి,అంకర్ సుధాకర్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాద వశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి

**ప్రజా పక్షం /మల్యాల :** గొర్రెను కాపాడబోయి ప్రమాద వశత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ లచ్చయ్య వయసు (66 ) జీవనోపాధి కోసం గొర్రెల కాపరిగా ఉండుకుంటూ తన భార్యతో జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే లచ్చయ్య గొర్రెలను మేపటానికి మ్యాడంపల్లి గ్రామ శివారు లోని చెరువు వద్దకు తీసుకెళ్లడు. మందలోని ఒక గొర్రె చెరువులోకి వెళ్లడం తో దానిని కాపాడే క్రమంలో చెరువులోని తీగలు కాళ్లకు చుట్టుకుని బయటకు రాలేక ఊపిరాడక చనిపోయినట్లు మృతుడు భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

## ఫెయిల్ అయిన అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం /కాగజ్ నగర్ :** రాష్ట్రంలో సిసిఇ విధానం 2015 సంవత్సరం నుంచి అమలు లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థు లకు ఈ ఏడాది జూన్ 5 నుంచి నిర్వహించే పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష లకు హాజరయ్యే అవకాశం ప్రభుత్వం కల్పిం చినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభా కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని,విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సిద్ధం కావాలని మండల విద్యాధికారి సూచించారు.

## మొక్కజొన్న కొనుగోలు వెంటనే చేపట్టాలి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

**ప్రజాపక్షం /జన్నారం :** మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని డి మాండ్ చేస్తూ జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన రైతులు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. రోటి గూడ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న (మక్కలు) పోసి నెల రోజులుగా గడుస్తున్నప్పటికీ అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.పంటను కొనుగోలు కేంద్రంలో ఉంచి రోజులు గడుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆలస్యం వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింటోం దని, ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు.ఇప్పటికైనా అధికారులు వెం టనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రి యను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు.అనంతరం రైతులు తహసీల్దార్ బక్కయ్య ను స్వయంగా కలిసి తమ సమస్య లను వివరించి వినతిపత్రం అందజేశారు.

## తుమ్మిడి హెట్టిలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు

**ప్రజాపక్షం/కౌటాల :** మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్లు ఉపేం దర్, సుమిత్ర రైతులకు పంటల సాగు విధా నాలు,ఎరువుల వినియోగం, పురుగులవ్యా ధుల నివారణపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వినియోగం, పంట మా ర్పిడి, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్త రణ అధికారి సొగల కల్పనా,సర్పంచ్ పోరేశ్ సూరజ్, ఉప సర్పంచ్ డి.రమేష్ పాల్గొన్నారు.

## భోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నిలిపివేత

**ప్రజాపక్షం / బోథ్ :** నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుల నియామక ప్రక్రియ తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడె గజేందర్ శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ సాయకులతో నిర్వహించిన సమావే శంలో తాజా రాజకీయా లను వివరించినట్లు గజేం దర్ పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సంయమనం పాటించా లని కార్యకర్తలను కోరారు.



# రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

### తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి విజయ్ కుమార్



**ప్రజాపక్షం /పెంచికలపేట్ :** రైతులు వ్యవసాయ రుణా లను సకాలంలో చెల్లించి, క్రాప్ లోన్లను నిర్దిష్ట గడువులోపు రెన్యువల్ చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాస్పల్లి శాఖ ఫీల్డ్ అధికారి విజయకుమార్ సూచిం చారు.శనివారం మండలంలోని చేడువాయి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తీసుకున్న పంట రుణాలను సమయానికి చెల్లించడం ద్వారా తిరిగి సులభంగా రుణ సదుపాయాలు పొందవచ్చని తెలి పారు.ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీలు, ఇతర సబ్సిడీ పథకాల ప్రయోజనాలు పొందాలంటే క్రాప్ లోన్లను తప్పనిసరిగా గడువులోపు రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. నిర్ణీత సమయంలో లోన్ రెన్యువల్ చేయకపోతే ప్రభుత్వ సబ్సిడీలు వర్తించవని రైతులకు వివరిం చారు.అలాగే రైతులు బ్యాంకులతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచిం చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల లబ్ధి పూర్తిగా పొందేందుకు రుణాలను సకాలంలో చెల్లిం చడం ఎంతో అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ స్తులు ఇస్మాయిల్,బండన్న,రవి,సురేష్,వెంకటేష్,అంజి, కిరణ్,బ్యాంక్ సిబ్బంది చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అజ్మీర నందు నాయక్



**ప్రజాపక్షం/జన్నారం :** మంచిర్యాల జిల్లా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జన్నారం గ్రామానికి చెందిన అజ్మీర నందు నాయక్ నియమితులయ్యారు. అలాగే జన్నారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాంధీ నగర్‌కు చెందిన మంద రాజేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నుంచి శనివారం నియామక పత్రాలు అందాయి.పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పని చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండటంతో పాటు పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న అజ్మీర నందు నాయక్‌కు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పట్టణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మంద రాజేష్‌కు పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలి పాయి.ఈ సందర్భంగా అజ్మీర నందు నాయక్, మంద రాజేష్ మాట్లాడుతూ తమపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుం టామని తెలిపారు. మండ లంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయ డంతో పాటు పార్టీ సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకె ళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సమ స్యల పరిష్కారానికి ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు.తమకు ఈ పదవులు రావడంలో కృషి చేసిన ఖానాపూర్ శాసనస భ్యులు వెడ్మా బొజ్జు పటేల్‌కు,జిల్లా నాయకత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతనంగా బాధ్యతలు చేప ట్టిన నందు నాయక్,మంద రాజేష్‌లకు పార్టీ నాయ కులు,కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు పాలిటెక్నిక్ కోర్సు ఒకే బంగారు బాట

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** 10వ తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు సరైన కోర్సులను ఎంచుకోవడం ద్వారానే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, సాంకేతిక రంగంలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు పాలి టెక్నిక్ ఒక అద్భుతమైన రన్‌వే లాంటిదని నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి.రమేష్ కొనియా డారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశా లలో ఈ రోజు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, సాంకేతిక విద్యా ప్రాధాన్యతపై నిర్వహించిన అవగాహన సదస్సు అత్యంత వైభవంగా విజయవంతంగా జరిగింది. 10వ తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు ఏలాంటి కోర్సులు ఎంచుకోవాలి, పాలిటెక్నిక్ ద్వారా ఉండే అద్భుతమైన పాది ఉన్నత విద్యా అవకాశాలు ఏమిటి, అనే అంశాలపై విద్యార్థులకు తల్లిదండ్రులకు ఈ సదస్సులో సంపూర్ణ అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.రమేష్ , జ్యోతి ప్రజ్వ లన చేసి సదస్సును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతిక విజ్ఞానానికి విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో ఇంజనీ రింగ్ రంగంలో స్థిరపడటానికి పాలిటెక్నిక్ ఒక అద్భుత మైన మార్గమని వివరించారు. కోర్సు పూర్తి కాగానే సొంతంగా స్వయం ఉపాది సాధించేలా, లేదా ప్రముఖ సాఫ్ట్‌వేర్ , హార్డ్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించేలా పాలిటెక్నిక్‌లో శిక్షణ ఇస్తామన్నారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యార్థులకు అత్యాధునిక ప్రయోగశా లల ద్వారా లైవ్ ప్రాజెక్ట్‌పై ప్రాక్టికల్ అవగాహన కల్పిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో ఉండే విస్తృత ఉద్యోగ అవకాశాలను, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వివ రాలను ఆయన విద్యార్థులకు కూలంకషంగా వివరిం చారు. డిప్లొమా తర్వాత ఈసెట్, పరీక్ష ద్వారా నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో చేరే సులువైన మార్గాన్ని విశ్లేషించారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాప కులు, అత్యాధునిక ల్యాబ్స్ ఉన్నాయని విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్ కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో చుట్టపక్కల ఉన్న పలు పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో 10వ తరగతి ముగించుకున్న విద్యార్థులు, వారి తల్లిదం డ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సదస్సు ముగింపులో విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ప్రిన్సిపాల్ ఆధ్యాపక బృందం నివృత్తి చేశారు. ఈ కార్యక్ర మంలో శాఖల అధ్యాపక బృందం ల్యాబ్ అసిస్టెంట్లు మరియు ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్సకు రెండు లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం బాదన్ కుర్తి గ్రామానికి చెందిన అలిశెట్టి రమేష్‌కు నిమ్స్ ఆసుప త్రిలో అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2 లక్షల ఎల్.ఓ.సి. లెటర్‌ను ఖానాపూర్ ఎం.ఎల్.ఏ. వెడ్మ బొజ్జు పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ. మాట్లా డుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటొందని తెలిపారు. అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా అండగాఈ నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రాజూరా సత్యం , మార్కెట్ వైస్ చైర్మెన్ అబ్దుల్ మజీద్, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసి డెంట్ జంగిలి శంకర్ సర్పంచుల పోరం ప్రెసిడెంట్ రాజు నాయక్, బాదన్‌కుర్తి మాజీ ఎంపిటిసీ గుదాల రాజన్న, తర్ల పాడ్ సర్పంచ్ సచిన్, బొాశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రావుల సోమన్న నియామకం



**ప్రజాపక్షం/ మావల:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా నియమితులైన రావుల సోమన్న శనివారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావుల సోమన్న మాట్లాడుతూ రైతు బిడ్డనైన తనకు డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతో షంగా ఉందన్నారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా మార్కెట్ యార్డులో రైతులకు పూర్తి న్యాయం జరిగేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగంబర్ పాటిల్, సుధాకర్ గౌడ్, రావుల రమేష్ యాదవ్, గోప వెంకటేష్, సుకేందర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల.. పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### ఐటిడిఎ పిఒ మంద మకరందు



**ప్రజాపక్షం/ ఉట్నూర్:** గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మక రందు తెలిపారు. శనివారం ఉట్నూర్‌లోని ఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల ఆదివాసి సర్ మేడిలు, వివిధ సంఘాల నాయకులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, భూసమ స్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉట్నూర్‌లో ప్రధానమంత్రి జుగా పథకం కింద కేంద్ర గ్రంథాలయం మంజూరైందని, ఇది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, గిరిజన సంఘాల ప్రతిని ధులు, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి ఆలయ 17వ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/కౌటాల :** మండలంలోని తాటిపల్లి గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధ లతో ఘనంగా నిర్వహించారు. 2009 మే 16న ప్రాణ ప్రతిష్ఠ జరి గిన ఈ ఆలయం ఉమ్మడి ఆసిఫాబాద్ జిల్లాలో తొలి వాల్మీకి ఆల యంగా ప్రత్యేక గుర్తింపు పొందింది.గంగపుత్రులు, భోయ కుల స్థులు,గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, భోయ కుల పెద్దలు, గ్రామ పెద్దలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కేర్ డిగ్రీ కళాశాలలో జాయిన్ అవ్వండి

### భవిష్యత్తుకు భరోసా పొందండి





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేర్ డిగ్రీ కళాశాలలో జాయిన్ అవ్వండి భవిష్యత్తుకు భరోసా పొందండని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ అన్నారు. కేర్ డిగ్రీ కళాశాల గత 21 సంవత్సరాలుగా అత్యుత్తమమైన విద్యనందిస్తూ ఎంతో మంది విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. శనివారం కళాశాలలో నూతన కోర్సులు ప్రారంభం సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులను చదువుతో పాటు అటు ఆటల్లో రాణించేలా ప్రోత్సాహమందిస్తూ అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసిన విద్యాసంస్థ పేరు గాంచిందన్నారు. ఈ సంవత్సరం విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించే గ్రూపులను తీసుకుని రావటం జరిగిందని కొత్త కోర్సులతో పాటు అన్ని కంప్యూటర్ సైన్స్ కోర్సులు కూడా ఉన్నాయన్నారు. కేర్ డిగ్రీ కళాశాలలో జాయిన్ అవ్వండి భవిష్యత్తుకు భరోసా పొందాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ఇన్‌చార్జిలు సందేశ్, సందీప్, కిరణ్‌లు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో తొలి యాంజియోగ్రామ్ విజయవంతం



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్‌లో తొలి యాంజియోగ్రామ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించబడినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. నాగమోహన్ రావు తెలిపారు. సింకోపల్ అటాక్స్‌తో బాధపడుతున్న యాదయ్యకు శనివారం ఉదయం యాంజియోగ్రామ్ విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. కార్డియాలజి వైద్య బృందం సమిష్టికృషితో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసినట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆధునిక గుండె వైద్యసేవల బలోపేతానికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోందన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఇన్నోవేషన్ డే




**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** విద్యా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగంపై అవగాహన సదస్సు ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక విద్యా వారోత్సవాలలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇన్నోవేషన్ డే కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన సాంకేతికతపై అవగాహన కల్పించే దిశగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కృత్రిమ మేదస్సు అప్లికేషన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఎన్ లక్ష్మణ్‌గారు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత తరుణంలో ఏ,ఐ. అనేది కేవలం విద్యారంగానికే పరిమితం కాకుండా వైద్య రంగం, మైనింగ్ తదితర అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తోందని ఆయన తెలిపారు. కంప్యూటర్ల పరిణామ క్రమంలో ఏ.,ఐ. అనేది ఐదవ తరం సాకేంతికతకు చెందినదని, భవిష్యత్తు అంతా దీనిపై ఆధారపడి ఉంటుందని విద్యార్థులకు విరించారు. నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచెకొని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్. పి. సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాపక బధృందం జయశ్రీ అనసూయ, శ్రీలత, మధు, శోబన్‌బాబు, బోదనేతర సిబ్బంది అనీల్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా చురుగ్గా పాల్గొని సెమినార్‌ను ఆసక్తిగా వీక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంపై నిర్వహించిన ఈ అవగాహన సదస్సు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, సృజనాత్మకత మరియు సాంకేతికతపై ఆసక్తిని పెంపొందించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలక్ష పేర్కొన్నారు.

# వడ్దూర్, లింగట్ల రూట్లలో నిర్మల్ డిపో కొత్త బస్సులు

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కే. పండరీ ఒక ప్రకటనలో తెలిపారు. వడ్దూర్, దన్నూరు మీదుగా బోథ్‌కు మరియు లింగట్ల రూత్లలో ఈ బస్సులు నడవనున్నాయి. ఉదయం పూట బోథ్ సర్వీస్ 8 గంటలకు నిర్మల్ నుండి బయలుదేరి, రేడిగొండకు 8.55 గంటలకు వడ్దూర్ ధన్నూర్ మీదుగా ప్రయాణించి 9.40 గంటలకు బోథ్ చేరుకుంటుంది. తిరిగు ప్రయాణంలో బోథ్ నుండి 9.45 గం.లకు నిర్మల్ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం వేళల్లో ఈ బస్సు 3.10 గం.లకు నిర్మల్ నుండి బయలుదేరి, నేరడిగొండకు 4.05 గం.లకు చేరుకుని బోథ్ వెళ్తుంది. మళ్ళీ బోథ్ నుండి సాయం త్రం 5.00 గం.లకు బయలుదేరి నేరడిగొండకు 5.45 గం.లకు కుంటాలకు 6.10 గం.లకు చేరకుని రాత్రి 7.30 గం.లకు నిర్మల్ చేరుకుంటుంది. మరో వైపు లింగట్ల సర్వీస్ ఉదయం 7.00 గంటలకు నిర్మల్ నుండి బయలుదేరి అనంతపేట్, మేడిపెల్లి, మీదుగా 8.20 గంల.కు లింగట్ల చేరుకుటుంది అక్క నుండి వెంటనే బయలుదేరి ఉదయం 9.30 గం.లకు నిర్మల్ వస్తుంది. తిరిగి సాయంత్రం 4.40 గం.లకు నిర్మల్ నుండి బయలుదేరి 5.40 గం.లకు లింగట్ల చేరుకుని , అక్కడ నుండి. 5.50 గం.లకు తిరుగు ప్రయాణమై నిర్మల్ చేరుకుంటుంది. వడ్దూర్, దర్బా, దన్నూరు, లింగట్ల, తాండ్ర, తదితర గ్రామాల ప్రయాణికులు, విద్యార్థులు ఈ ఆర్.టి.ఇసి.ఇ బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డి.ఎం. కే. పండరి కోరారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల విజయవంతం




**ప్రజాపక్షం / భైంసా :** భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల కోసం "కృత్రిమ మేదస్సు) ఏ.ఐ. పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆదునిక సాంకేతికతతో ఏ.ఐ. ప్రాధాన్యత, విద్యా రంగంలో దాని వినియోగం, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే సందర్భంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వ్యాస రచన వక్త్వి పోటీలు నిర్వహించబడ్డాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలు విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి మరియు వాక్చాతుర్యాన్ని పెంపొందించేందుకు దోహదపడ్డాయి. కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సాహిత్య , సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొన్లాని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.రఘునాథ్, IQAC కో ఆర్డినేటర్ డా.భీంరావు పాల్గొన్నారు.

# కళలతో విద్యార్థులో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ :** సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనరగ్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిచంనిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళలలు, హస్తకళలు సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు కళలలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు సాంస్కృతిక నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు , ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ రాజు, ఎం.ఇ.ఓ. పద్మ పాఠశాల ప్రిన్సిపాల్ దానియల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు 20వ తేదీ చివరి రోజు

**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండల సమస్త రైతులు మొక్కజొన్న (మక్కలు ) కొనుగోలు 20.05.2026 చివరి రోజుగా నిర్ణయించడం జరిగిందని బోథ్ సెంటర్ ఇన్‌చార్జి బారేనాగభూషన్ తెలిపారు. రైతులు మిగిలిన మొక్కజొన్న పంటను మార్కెట్లో చవరి రోజులోగా విక్రయించుకోవాగలరని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నియామకం



**ప్రజాపంక్షం / ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం లో ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులును నియమించడం జరిగింది. ఎన్నో రోజులుగా నామినేటెడ్ పదువుల కోసం ఆశతో ఎదురుచూస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పించిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఖానాపూర్ మండల అధ్యక్షుడిగా జంగిలి శంకర్, కండెం మండల అధ్యక్షుడిగా బొడ్డు గంగన్న, దస్తురాబాద్ మండల అద్యక్షుడిగా ఆరె రమేష్‌రావు, పెంబి మండల అధ్యక్షుడిగా గుడిసె రమేష్ జన్నారం మండల అధ్యక్షుడిగా ఎ.నందు నాయక్‌లను నియమిస్తూ టిసిసిసి ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా ఖానాపూర్ టౌన్ అధ్యక్షులుగా గొర్రె గంగాధర్, కండం టౌన్ అధ్యక్షుడిగా ఎండి వాజిద్, పెంబి టౌన్, అధ్యక్షుడిగా భూమేష్ మంద రాజేశ్‌లను నిమిస్తూ టిపిసిసి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

# ఎఐ లైఫ్ స్కిల్‌పై వర్క్‌షాప్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్‌లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎఐ లైఫ్ స్కిల్‌పై నాలుగు రోజుల వర్క్‌షాప్ జూన్ 8 నుంచి 11 వరకు నిర్వహించబడుతుదని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు లైఫ్‌స్కిల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాథమిక అంశాలు, వివిధ దరఖాస్తులపై అవగాహన కల్పించి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేలా తీర్చిదిద్దడమే ఉద్దేశ్యమన్నారు. ఆసక్తి కలిగిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 18 నుండి జూన్ 6 సాయంత్రం 5 గంటలలోగా పని దినాలలో సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ స్కూల్ గేటు నెంబర్ 2కి ఎదురుగా బీసీ స్టడి సర్కిల్‌లో నేరుగా దరఖాస్తు అందజేయాలని వివరాలకు 08462241055 ను సంప్రదించాలని కోరారు.

# పట్టణ అభివృద్ధికి కృషి చేస్తాం

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మండల కేంద్రంలోని చైర్‌పర్సన్ నాగమణి స్వామి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించామని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులందరూ పలు అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ లతా నర్సయ్య, కౌన్సిలర్లు శ్రీజ, కుశ లత, సతీష్, బాలలక్ష్మి, లావణ్య, అంజుమ్‌అలీ, సందీప్, సంధ్య, నుపమ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## నృసింహుడిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు



**ప్రజాపక్షం/ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారిని శనివారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్లు పీవి శ్రీనివాసరావు, దేశాల భూపాల్ లు దర్శించుకున్నారు. తొలుత ప్రధానాలయం శ్రీ యోగానంద స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించిన కమిషనర్లు అనంతరం అన్ని అనుబంధ ఆలయాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు, అర్చకులు కమిషనర్లకు వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్థానిక తహశీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఉన్నారు.

## మానవత్వాన్ని చాటిన మనోజ్ గౌడ్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నిరుపేద దహన సంస్కారాలకు ఆర్థిక సహాయాన్ని అందజేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్. సుల్తానాబాద్ మండలం చిన్నబొంకుర్ గ్రామం లో కుండీ అమృతమ్మ అనే నిరుపేద మహిళ శుక్రవారం రాత్రి అనారోగ్యం తో మృతి చెందగా వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ దహన సంస్కారాల ఖర్చులకు 3000/ కుమారుడు కుండీ సంపత్ కి అందజేశారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, గ్రామ పంచాయతీ పాలకవర్గం నడుం బిగించింది. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రజిని కుమారి, సర్పంచ్ వినోద్ కుమార్, ఉపాధ్యాయ బృందం కలిసి గ్రామంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలను కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల కలిఏగ ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రభుత్వ పాఠశాలలు కేరాఫ్ అడ్రస్ అని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత మూడు రోజుల నుంచి పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తుందన్నారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న వారి వివరాలు సేకరించి, ప్రభుత్వ పాఠశాలలోని వసతులు, పథకాల గురించి తల్లిదండ్రులకు వివరిస్తూ వారిని మోటివేట్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని, ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచాలని గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుల సహకారంతో ప్రత్యేక నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యా పథకాలు ప్రతి విద్యార్థికి అందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు.సీనియర్ ఉపాధ్యాయులు ఎం.సాయిలు, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు సుదర్శన్ రెడ్డి సందర్శించారు. శనివారం అమావాస్య సందర్భంగా అష్టముఖి కోనేరులో వేలాదిగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే అష్టమి కొనేరులో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనేరు ఆలయం వద్ద సౌకర్యాలపై భక్తులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శనివారం అమావాస్య రావడం అనేది అరుదు అని, ఇలా ఒకే రోజు ఉండటం పవిత్ర అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకమన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం దేవాదాయ శాఖ, పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ప్రసిద్ధమైందని ఇక్కడ వివాహాలు సైతం జరుగుతుండటంతో ఆలయం దిగువ భాగంలో సుమారు 70లక్షలతో కళ్యాణ మండపం నిర్మించడం జరిగిందని, త్వరలోనే దానిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకవస్తామన్నారు. ఆలయం వద్ద మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు, బిల్లా రామ్మోహన్, స్థానిక సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, విజ్ గౌడ్, ఈరంటి లింగం, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.



# భక్తులతో పోటెత్తిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం

### అష్టముఖి కోనేరులో భక్తుల పుణ్య స్నానాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** శనివారం అమావాస్య సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద గల పవిత్ర అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టముఖి కోనేరు వద్ద భక్తుల సౌకర్యార్థం భద్రతా ఏర్పాట్లను ఆలయ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పర్యవేక్షించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం, కోనేరు ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. శనివారం అమావాస్య అరుదుగా వచ్చే సందర్భంగా అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరిస్తే సర్వ పాపాలు తొలగుతాయని, శని దోషాలు హరింపబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పుష్కరిణిలో స్నానం ఆచరించేందుకు విచ్చేశఋూరు. భక్తులు ఓం నమో నారాయణనాయ అనే అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ కోనేరు చుట్టు ప్రదక్షిణలు చేశారు. భక్తుల దర్శనార్థం బారికేడ్లను నిర్మించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుమారు 20వేల పై చిలుకు భక్తులు అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు భక్తుల తాకిడి కొనసాగింది. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పెద్ద ఎత్తున దుకాణ సముదాయాలు వెలిశాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ మేరకు నిజామాబాద్ వాసవి సేవా సంఘం సభ్యులు 8నుంచి 10వేల మంది భక్తులకు అల్పాహారం, మజ్జిగ, త్రాగునీటి వసతిని ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఏలాంటి అవాంచణీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ ల ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ వేణు, మాజీ ధర్మకర్త మండలి సభ్యులు, గ్రామ యువకులు ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.





## అష్టముఖి కోనేరు.. వద్ద దొంగల చేతివాటం

### మూడు సెల్‌పోన్‌ల చోరీ



**ప్రజాపక్షం/ఎడపల్లిం:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద గల అష్టముఖి కోనేరులో శనివారం అమావాస్య సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఓ వైపు భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటే దొంగలు భక్తుల సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. మోస్రా మండలంలోని గోవూర్‌కు చెందిన ఇద్దరు మహిళా భక్తులు తమ ఫోన్లను ప్రక్కన పెట్టి కోనేరులో మునిగితేలంతలోపు వారిద్దరి ఫోన్లను కొట్టేశారు. అలాగే మరో భక్తురాలి స్మార్ట్ ఫోన్ సైతం ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధిత మహిళలు ఆందోలన వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీస్ శాఖ కోనేరు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన దొంగలు మాత్రం తమ పనిని కానిచ్చేశారు. అయితే వేలాదిగా తరలివచ్చిన భక్తులు తమ తమ వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని హెచ్చరించిన భక్తుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటివి చోటుచేసుకున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

## డిమాండ్ ఉన్న పంటలతోనే అధిక లాభాలు

### శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య



**ప్రజాపక్షం/ఎడపల్లి:** వ్యవసాయం లాభసాటిగా మారాలంటే కేవలం అధిక దిగుబడిపైనే కాకుండా, మార్కెట్ డిమాండ్‌పై దృష్టి సారించాలని రుద్రూర్ చెరకు, వరి పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్త కృష్ణ చైతన్య సూచించారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కృష్ణ చైతన్య మాట్లాడారు. విశ్వ విద్యాలయం లేదా వ్యవసాయ శాఖ సిపార్సు చేసిన నాణ్యమైన విత్తనాలనే వాడాలని, దీని వల్ల పంటకు మంచి ధర లభించి ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. నేల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ కోసం రైతులు క్రమంగా సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్, ఎఈఓ జ్యోతి, గ్రామ సర్పంచ్ హన్మంతు, ఇతర వ్యవసాయ శాఖ అధికారులు, బ్రహ్మణ పల్లి గ్రామ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## తహసీల్దార్,ఎస్ఐలకు మెడికల్ అసోసియేషన్ వినతి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి తహసీల్దార్, శ్రీనివాస్, ఎస్ఐ జి మహేష్. లకు ధర్మపురి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈనెల 20న చేపట్టనున్న మెడికల్ షాపుల ఒకరోజు దేశవ్యాప్త బంద్ గురించి ముందస్తు సమాచారాన్ని తెలిపారు. అలాగే మెడికల్ అసోసియేషన్ డిమాండ్లకు మద్దతుగా జోక్యం చేసుకుని సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు.శ్రీనివాస్,కుమ్మరి లక్ష్మణ్,వావిలాల గంగాధర్, వరప్రసాద్, సంగి మోహన్,రత్నాకర్,పంబాలరవి,ఆకుల రవి,మహేష్,పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని NSV డిగ్రీ కళాశాల లో 2026 లో డిగ్రీ పూర్తి చేసుకున్న B.Sc విద్యార్థులచే ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్లలో సీటు సంపాదించాలని అక్కడికి వెళ్లినప్పుడు చుట్టూ ఉండే వాతావరణం మిమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు లేదా ఇంకా ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సాహకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అలాంటి వాతావరణంలో చదవడం ద్వారా మానసిక దృఢత్వాన్ని, మంచి స్నేహితులను సాధించగలుగుతారని అనుకున్నది ఏదైనా సాధించే పట్టుదలను, జ్ఞానాన్ని అక్కడి లైబ్రరీలలో వుండే పుస్తకాల ద్వారా పొందవచ్చని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేష్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ముసిపట్ల రాజేందర్,ప్రిన్సిపాల్ మల్లికార్జున్,ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలో నవోదయ పాఠశాల కేంద్రీయ విశ్వవిద్యాలయాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కోరుతూ ఎంపీ ధర్మపురి అరవింద్ దీక్షకు పోలీసులు నిరాకరించారు.దీంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు తరలి వెళ్లిన బిజెపి నాయకులను మల్లాపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.అరెస్టు అయిన వారిలో వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్, బిజెపి మండల ఉపాధ్యక్షుడు లవంగ శివ, మాజీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు,ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్,నాయకులు చంద్రశేఖర్, ఉన్నారు.

## కందుల సంధ్యారాణిని సన్మానించిన సుల్తానాబాద్ బిజెపి నాయకులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన శ్రీమతి కందుల సంధ్యారాణి ని సుల్తానాబాద్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంధ్యారాణి కి రాష్ట్ర స్థాయి బాధ్యతలు రావడం సంతోషకరమని అన్నారు.ఆమె నాయకత్వంలో ఓబీసీ మోర్చా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.శ్రీమతి కందుల సం ధ్యారాణి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం మరింత కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఉద్రిక్తత కేంద్రీయ విద్యాలయం కోసం పోరాటం

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నెల 18న నిర్వహించనున్న ఎంపీ ధర్మపురి అరవింద్ ధర్మదీక్షకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. “జగిత్యాల విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయం అవసరం” అంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రభుత్వం కావాలనే కేంద్రీయ విద్యాలయ ఏర్పాటును అడ్డుకుంటోందని ఆరోపించారు.ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు భారీగా మోహరించి నిరసనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో డాక్టర్ భోగ శ్రావణితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని ఈడ్చుకెళ్లారు. మహిళా నాయకురాలు అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించారంటూ బీజేపీ శ్రేణులు మండిపడ్డాయి.పోలీసులు ఈడ్చుకెళ్లే సమయంలో జరిగిన తోపులాటలో డాక్టర్ భోగ శ్రావణికి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. ఆమెను అదుపులోకి తీసుకెళ్తున్న దృశ్యాలు అక్కడ ఉద్రిక్తతను మరింత పెంచాయి.తమ నాయకురాలిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని కార్యకర్తలు



ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం డాక్టర్ భోగ శ్రావణితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా బీజేపీ కార్యకర్తలు ఆందోళన కొనసాగిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ, “జగిత్యాల యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో మేము పోరాటం చేస్తున్నాం. ధర్మదీక్షకు అనుమతి ఇవ్వకుండా ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. పోలీసులు బలప్రయోగంతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారు. అయినా మా పోరాటం ఆగదు” అని హెచ్చరించారు.జగిత్యాలలో చోటుచేసుకున్న ఈ ఘటనతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కేంద్రీయ విద్యాలయం అంశం జిల్లాలో ప్రధాన రాజకీయ చర్చగా మారింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,తదితరులు ఉన్నారు.

## వడ్లు పోసి నెల రోజులు గడుస్తునా కొనుగోలు నత్తనడక

### మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలం చల్ గల్ గ్రామంలోని మార్కెట్ యార్డ్ లో పోసిన వడ్ల కుప్పలను శనివారం జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ...రైతులు వడ్లు పోసి దాదాపు నెల రోజులు గడుస్తున్నాయి. ఈ సంవత్సరం వాతావరణ శాఖ అంచనా ప్రకారం రుతుపవనాలు తొందరగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలని ఆమె అన్నారు. గన్ని బ్యాగులు,లారీల కొరత ఉందని రైతులు చెప్తున్నారని జిల్లా యంత్రాంగం అధికారులు స్పందించి ఒక ప్రణాళిక బద్ధంగా కొనుగోలు సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగే విధంగా చూడాలని ఆమె అన్నారు. అకాల వర్షాలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని, కొనుగోలును వేగవంతం చేయాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. ఆనాడు బిఆర్ఎస్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత రైతు నాయ



కుడు కేసిఆర్ గారిది అని ఆమె అన్నారు. గత ప్రభుత్వంలో కొనుగోలు ఏ విధంగా జరిగిందో అదే విధంగా ప్రస్తుతం జరగాలని ఆమె అన్నారు. రైతులకు నీటి కష్టాలు కరెంటు కష్టాలు తొలగాలని కెసిఆర్ 24 గంటల కరెంటు ఇచ్చి కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టి అన్నదాతలను ఆదుకొని భూమికి భారమయే అంత పంట తెలంగాణ రాష్ట్రంలోనే పండుతుందని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రావు, శీలం ప్రవీణ్,ఎల్లా రాజన్న,ముత్యం రమేష్,వెంకటేష్, యోహాన్ కిషోర్,రైతులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సొమ్ము దోపిడీ చేస్తున్న పెట్రోల్ బంకుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15 న దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే , ఐతే పెట్రోల్ బంకుల యాజమాన్యాలు లీటరుకు రూ. 3 చొప్పున ప్రజల నుండి వేల కోట్ల రూపాయలను అక్రమంగా దోపిడీ చేస్తున్నాయని ధర్మ సమాజ్ పార్టీ (DSP) పెద్దపల్లి జిల్లా మాజీ కన్వీనర్ మరియు బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ పెద్దపల్లి జిల్లా నాయకులు కనకం గణేష్ మహారాజ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న ఈ భారీ దోపిడీ వెనుక ఉన్న కుట్రలను ప్రజల ముందుకు తెచ్చారు.ఈ సందర్భంగా కనకం గణేష్ మహారాజ్ మాట్లాడుతూ హిందుస్తాన్ పెట్రోలియం ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం వంటి ఇంధన సంస్థలు ధరలు పెంచినప్పుడు, పాత నిల్వలతో కొత్త ధరల దోపిడీ చేస్తున్న బంకుల యాజమాన్యాలు తాము గతంలోనే (తక్కువ ధరకు) కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్న పాత స్టాక్‌ను కూడా పెరిగిన కొత్త ధరలకే అమ్ముతున్నారు. వాస్తవానికి ఆ పాత నిల్వలు ముగిసేవరకు పాత ధరలకే అమ్మాల్సి ఉండగా, నిన్నటి రేటుతో కొన్న ఇంధనాన్ని ఈరోజు పెరిగిన రేటుకు అమ్ముతూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కొత్త ధరలకు విక్రయిస్తూ పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న ఈ భారీ దోపిడీ చేస్తున్న పెట్రల్ బంక్ యాజమాన్యాల పైన ఆవశ్యక వస్తువుల చట్టం, 1955,




1955) లీగల్ మెట్రాలజీ చట్టం, 2009, వినియోగదారుల రక్షణ చట్టం, 2019 చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమో దు చేయాలని డిమాండ్ చేస్తూ చర్యలు లేనిపక్షంలో సా మాన్య ప్రజలను, వినియోగదారులను ఏకం చేసి సమంత అధికారుల కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ధర్మ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా మాజీ కన్వీనర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ పెద్దపల్లి జిల్లా నాయకులు కనకం గణేష్ మహారాజ్ హెచ్చరించారు.

## జగిత్యాలలో భక్తిశ్రద్ధలతో శనీశ్వరుడి జయంతి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో శ్రీశనీశ్వరుడి జయంతి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు, పూజారులచే తైలాభిషేకాలు,అర్చనలు,హారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీశనీశ్వరుడికి నల్ల వస్త్రం, నువ్వులు, కొబ్బరికాయలు, గంధం, పసుపు, కుంకుమ, అగర్‌బత్తులు, నీరుతో అభిషేకాలు నిర్వహించారు.అలాగే ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఈసందర్భంగా ఆలయ అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ..శ్రీశనీశ్వరుడి జయంతి ఏటా వైశాఖ అమావాస్య తిథినాడు శశనీశ్వరుడి జయంతి నిర్వహించడంతో ఆయన అనుగ్రహం పొందితే అడ్డంకులు, సమస్యలు తొలగిపోతాయని, శని దేవుడి ఆశీర్వాదం వల్ల అనుకున్న కోరికలు తీరుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంజన్న,పద్మశాలి సేవా సంఘం సభ్యులు,తదితరులు ఉన్నారు.

## పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి గార్డెన్ లో ఆదివారం నిర్వహిస్తున్న పెద్దపల్లి జిల్లా పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమాన్ని పద్మశాలి కుల బాంధవులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామమూర్తి అన్నారు.శనివారం జిల్లా పద్మశాలి సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దూడం వెంకటరమణ, పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకట్ల రాజకుమార్, రాష్ట్ర నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం సమస్యలపై అతిథులకు తెలుపుతూ, నూతనంగా ఎన్నిక కాబడిన మున్సిపల్ చైర్మన్ ,కౌన్సిలర్లు, సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్స్ గా ఎన్నికైన వారందరికీ సన్మాన కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించబడును. జిల్లా లోని మండల, పట్టణ, గ్రామాల, పద్మశాలి సంఘం కులస్తులు పాల్గొని హాజరు కావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, సాయిరి మహేందర్, గుండా మురళి, సామల హరి కృష్ణ,మేరుగు యాదగిరి,రమేష్,స్వతంత్ర కుమార్, పాల్గొన్నారు.

## నూతన సీఐ ని సన్మానించిన బిజెపి నాయకులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ రావు సుల్తానాబాద్ మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.నూతన సీఐ మాట్లాడుతూ, ప్రజల సహకారంతో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోట నాగేశ్వర్,బీజేవైఎం నాయకులు వడ్లకొండ శశివర్ధన్,మెంగాని రామ కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

